క్లుప్తంగా

సంయమనం పాటించాలి



రేగిడి: కోడిశలో గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని కొండవలస, కోడిశ గ్రామాల్లో ఎన్నికల ఫలితాల రోజున వ్యవహరించాల్సిన తీరుపై ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు సోమవారం అవగాహన కల్పించారు. అందరూ సంయమనం పాటించాలని, ఎవరూ గెలిచినా ఒకేలా స్పందించే తీరును కనబరచాలన్నారు. ఏ ఒక్కరూ ఎవరిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవదన్నారు. గొడవలు జరగకుండా చూడాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఏ ఒక్కచోట నలుగురు కన్నా ఎక్కువ మంది గుమిగూడి ఉండొద్దని సూచించారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



సర్టిఫికెట్లతో విద్యార్థులు

రాజాం: స్థానిక పట్టణంలోని బాలభవన్ వద్ద ఏప్రిల్‌లో ప్రారంభమైన వేసవి శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. 40 రోజుల పాటు కొనసాగిన ఈ తరగతుల్లో శాస్త్రీయ నృత్యం(భరతనాట్యం, కూచిపూడి), చిత్రలేఖనం, తబలా వంటి వాటిల్లో శిక్షణ ఇచ్చామని ప్రొగ్రాం డైరెక్టర్ ఎస్.రమేష్ తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువ పత్రాలు కూడా అందజేశామన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



ఆగూరులో విత్తనాలు అందిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

రాజాం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు సోమవారం పంపిణీ చేశారు. పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం పెరిగి, ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని ఏవో రేణుకాసాయి తెలిపారు. ఎకరాకు 10 కిలోల విత్తనాలు అవసరమని, అయితే ఒక రైతుకు గరిష్టంగా 50 కిలోల వరకు విత్తనాలు అందిస్తున్నామన్నారు. 10 కిలోల విత్తనాల ప్యాకెట్‌ను 50 శాతం రాయితీపై రూ.440కు ఇస్తున్నామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి పాత్రుని వెంకటరమణ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలు, విత్తనగుళికలు, ఘనజీవామృతం తయారీని తెలిపారు. విత్తనాలను గుళికలుగా తయారు చేసి, వాడుకోవడం ద్వారా మొలకశాతం పెరుగుతందని, తుఫానుల సమయంలో పంటలు దెబ్బతినకుండా ఉంటుదన్నారు. అలాగే వర్షాభావ పరిస్థితులను పంట ఎదుర్కొంటుందన్నారు. విత్తనగుళికల తయారీకి బంకమట్టి పొడి, ఘనజీవామృతం పొడితో విత్తనశుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు సత్యవతి, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

తెర్లాంలో 144 సెక్షన్ అమలు

తెర్లాం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో మంగళవారం 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెర్లాం ఎస్‌ఐ ఆర్.రమేష్ తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు, ఐదుగురు కన్నా ఎక్కువ మంది ఒక్కచోట గుమిగూడి ఉండకూడదన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు చేపట్టకూడదన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలను పరిరక్షించేందుకే 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ: స్థానిక మోడల్ స్కూల్‌లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 విద్యాసంవత్సరంలో 7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు విద్యార్థులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఈనెల 11న ఉదయం 9 గంటలకు పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందని, పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

సలహాలు పాటిద్దాం..
కల్తీని నివారిద్దాం!

- విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో రైతులు అప్రమత్తం
- అనుమతులున్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి
- కొనుగోళ్లకు సంబంధించి, వ్యాపారుల నుంచి రసీదు పొందాలి
- మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు ఇస్తామంటే నమ్మొద్దు



ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతు

మండలాల వారీగా వరి సాగు ఇలా..

మండలం	సచివాలయాలు	సాగు విస్తీర్ణం
వంగర	19	3568 హెక్టార్లు
రాజాం	17	4007 హెక్టార్లు
రేగిడి	25	6551 హెక్టార్లు
సంతకవిటి	24	7746 హెక్టార్లు

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యత కలిగిన విత్తనాలు, యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఎరువులు అందుబాటులో ఉన్నాయి.
- వ్యవసాయ శాఖ అనుమతులు ఉన్న డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసినప్పుడు వ్యాపారి నుంచి రసీదు తప్పనిసరిగా పొందాలి.
- కంపెనీ పేరు లేని విత్తనాలు, లూజు విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
- గడువు దాటిన విత్తనాలు, పురుగుమందులు, చినిగిన ప్యాకెట్లు, మార్కెట్ ధర కన్నా తక్కువకు ఇస్తామని చెప్పే వారి వద్ద కొనవద్దు.
- రైతులకు అందజేసే బిల్లుపై విక్రయదారుడి పేరు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే అమ్మకపు నంబరు, రైతుపేరు, విక్రయదారుడి సంతకం, గడువు తేదీ, బ్యాచ్ నంబరు, నికర తూకం వంటి అంశాలు నమోదు చేయాలి.
- విత్తనాలు మొలకెత్తే దశలో లోపాలు కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత ముందుగా మొలక శాతాన్ని పరీక్షించుకోవాలి.
- విక్రయదారుడు ఇచ్చే బిల్లును పంట పూర్తయ్యేవరకు భద్రంగా ఉంచుకోవాలి.
- అరువు పద్ధతిలో కొనుగోలు చేసినా బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.

వంగర: రుతుపవనాల ప్రభావం కారణంగా వర్షాలు ఇప్పుడిప్పుడే కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ కూడా ఆరంభం కావడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. విత్తనాలు విత్తుకోవడానికి దుక్కులు చేసి, పొలాలను సిద్ధం చేస్తున్నారు. విత్తన ఎంపిక, పంటల సాగుపై వ్యవసాయాధికారులు రైతుల్లో చైతన్యం నింపుతున్నారు. కల్తీ(నాణ్యత లేని) విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే రైతులు భారీగా నష్టపోయే పరిస్థితి ఉంది. అటువంటి పరిస్థితిని రైతులు అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రైతు భరోసా కేంద్రాలు, లైసెన్స్ పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సాగుకు సన్నద్ధమవుతున్న రైతులంతా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే విత్తనాలు, ఎరువుల్లో కల్తీని నివారించి, అధిక దిగుబడులు సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

'కియోస్క్'తో మోసానికి అడ్డుకట్ట..

రైతులు మోసపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, వాటిలో కియోస్క్ సాంకేతిక పరికరాన్ని ఏర్పాటు చేశారు. దీనిద్వారా రైతులకు కావాలసిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని, సకాలంలో పొందవచ్చు.

అందుబాటులో విత్తనాలు..

రైతు భరోసా కేంద్రాల్లో 969 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఎంటీయూ–1064, ఎంటీయూ–1121, ఎంటీయూ–1318, ఎంటీయూ–7029, ఎంటీయూ–1224 రకం విత్తనాలు, యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఎరువులు ఉన్నాయి. అలాగే మరో 59 క్వింటాళ్ల జీలుగు, కట్టెజనుము విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయి.



రైతు భరోసా కేంద్రానికి చేరిన విత్తనాలు(ఫైల్)

ప్రభుత్వ పనితీరు భేష్..



రైతులు మోసపోకుండా ఉండేందుకే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాలకు తరలించింది. పంటల సాగు నుంచి విక్రయాలు చేపట్టే వరకు రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు బాగున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనితీరు భేష్.

– కిమిడి చిట్టిబాబు, రైతు, కొండచాకరాపల్లి.

ఆర్‌బీకేల్లో నాణ్యమైన విత్తనాలు..



ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులన్నీ అనుకూల ధరలకే లభ్యమవుతున్నాయి. రైతులు ఎవరూ ప్రైవేట్ వ్యక్తుల వద్ద కొనుగోళు చేసి, మోసపోవద్దు. ప్రభుత్వ అనుమతి ఉంటే తప్ప డీలర్ల వద్ద కొనుగోలు చేయవద్దు. రైతులను మోసగించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

– తట్టికోట కన్నబాబు, ఏవో, వంగర.



బాగెంపేట ఆర్‌బీకేలో ఏర్పాటు చేసిన కియోస్క్ పరికరం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సంతకవిటి: మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ బాబూరావు

సంతకవిటి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సర్పంచ్ గేదెల బాబూరావు అన్నారు. జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని, మండలంలోని బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జూనియర్ రెడ్ క్రాస్ కన్వీనర్ అదపాక దామోదరరావు ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఉష్ణతాపం పెరుగుతోందని, ఇదే కొనసాగితే భవిష్యత్ తరాల మనుగడ అసాధ్యమన్నారు. మానవ మనుగడ కొనసాగాలంటే మొక్కల పెంపకం తప్పనిసరి అన్నారు. ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి, వాటిని పెంచాలని కోరారు. అడవుల శాతం పెరిగితేనే సకల జీవరాశులు బతుకుతాయన్నారు. అనంతరం పర్యావరణ దినోత్సవం రోజు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య, ఉపాధ్యాయులు ముంతపూడి ప్రసాద్, పి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని బూరాడ, రేగిడి, ఉనుకూరు, సంకిలి సెక్టార్ల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఒక్కో మొక్క చొప్పున నాటి, వాటిని దత్తత తీసుకున్నారు. వాటి పెంపకంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలను వారే తీసుకుంటారు.

నేడే ఉత్కంఠకు తెర

- 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం
- 10 గంటలకు మెజార్టీ వివరాలు వెల్లడయ్యే అవకాశం

రాజాం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం ప్రారంభం కానుంది. మే 13వ తేదీన పోలింగ్ జరగ్గా, ఆరోజు నుంచి ఈరోజు వరకు ఎవరు గెలుస్తారా అనే సందేహాలకు తెరపడనుంది. ప్రస్తుతం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన ఎమ్మెల్యే, ఎంపీల భవితవ్యం మధ్యాహ్నానికి తెలుస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని లెండీ కళాశాలలో ఈ ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోటీల్లో ఉన్న పలు పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు, కార్యకర్తలు లెక్కింపు కేంద్రానికి ఉదయం 6 గంటలకే చేరుకోనున్నారు. ఎవరికి వారే గెలుపు ధీమాలో ఉండగా, ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు జరగనుంది. 10 గంటల నాటికి ఈవీఎంల ఓట్లు లెక్కింపు ఊపందుకుంటుంది. 11 గంటల నాటికి రాజాం నియోజకవర్గానికి సంబంధించిన అభ్యర్థి గెలుపు అవకాశాల్లో స్పష్టత రానుంది.

వంగర మండలం నుంచి..

రాజాం నియోజకవర్గంలో ప్రధానంగా వైఎస్సార్ సీపీ, కూటమి అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. మొత్తం 284 పోలింగ్ బూత్‌లు ఉండగా, వంగర మండలం జేకే గుమ్మడ పోలింగ్ బూత్ నుంచి ఈవీఎం ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అనంతరం రేగిడి మండలం, అక్కడి నుంచి రాజాం మున్సిపాలిటీ, రాజాం మండలంలోని పోలింగ్‌బూత్‌ల ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. చివరగా సంతకవిటి మండలంలోని కావలి బూత్‌తో ఓట్లు లెక్కింపు ముగుస్తుంది. వంగర, రేగిడి మండలాల్లోని మెజార్టీయే ఈ నియోజకవర్గంలో అభ్యర్థి గెలుపును నిర్ధారిస్తుంది. ఇప్పటికే నియోజకవర్గంలో 2014, 2019లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయగా, ఈ దఫా కూడా ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ గెలుపొందనున్నట్లు అన్ని సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ తెలిపాయి. ఈ దఫా ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో మొత్తం 2,27,503 మంది ఓటర్లు ఉండగా, 1,72,906 మంది ఓటర్లు తమ ఓటు వినియోగించుకున్నారు. ఇందులో 86,928 మంది పురుష ఓటర్లు కాగా, 85,974 మంది మహిళా ఓటర్లు తమ ఓటు వినియోగించుకున్నారు. మహిళా ఓటర్లంతా వైఎస్సార్ సీపీకి జై కొట్టినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మరికొద్ది గంటల్లో వెలువడనున్నాయి. దీంతో నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారన్న ఉత్కంఠకు తెరపడనుంది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో 2,31,232 ఓట్లు ఉండగా, అందులో 1,14,216 మంది పురుషులు, 1,17006 మంది మహిళలు ఉన్నారు. మరో 10 మంది ఇతరులు ఉన్నారు. వీరంతా మే 13వ తేదీన ఓటుహక్కు వినియోగించుకున్నారు. మొత్తం 1,85,775 మంది ఓటు వేయగా, వీరిలో 91,158 మంది పురుషులు, 94,612 మంది మహిళలు ఉన్నారు. వీరిలో అత్యధికులు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయడంతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయం ఖాయమనే అభిప్రాయాన్ని విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



బాడంగిలో ప్రభుత్వ పాఠశాల విద్యపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

బాడంగి: బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారు. మండల కేంద్రం సహా మండలంలోని గజరాయునివలస, కామన్నవలస, ఎరుకులపాకలు, లక్ష్మీపురం, డొంకినవలస, తెంటువలస, పెదపల్లి, వీరసాగరం, ముగడ, భీమవరం, పూడివలస, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు కొంతమంది కలిసి సోమవారం పర్యటించి, ఇంటింటికీ వెళ్లారు. ఐదేళ్ల వయసు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పించడంతో పాటు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్యనందించడం జరుగుతుందన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ మరమ్మతులు



పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బాగు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఆదివారం రాత్రి భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షం, పిడుగుల ధాటికి కొప్పరవలస, వంగర, కోనంగిపాడు, రుషింగి, పటువర్ధనం, ఎం.సీతారాంపురం తదితర గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, పంట పొలాల్లోని ఇన్సూలేటర్లు ధ్వంసమయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, మరోసారి విద్యుత్ సరఫరాకు అసౌకర్యం కలగకుండా పనులు చేపడుతున్నామని ఏఈ కోనూరు వినయ్‌కుమార్ తెలిపారు.

పింఛన్ కోసం పడిగాపులు



బాడంగి ఎస్‌బీఐ బీసీ పాయింట్ వద్ద పింఛన్‌దారుల పాట్లు

బాడంగి: పింఛన్ కోసం లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రల కారణంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పంపిణీ అయిన పింఛన్లు నిలిచిపోయాయి. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తుండడంతో లబ్ధిదారులంతా ఆ డబ్బుల కోసం బ్యాంకులు, బీసీ పాయింట్‌లు, మినీ బ్యాంకులు, ఆధార్ పే సెంటర్‌లకు చేరుకుని, తమ ఖాతాల్లో డబ్బులు పడ్డాయో లేదో చూసుకుంటున్నారు. మండల కేంద్రం నుంచి సుదూర ప్రాంత గ్రామీణులంతా ఉదయం బయలుదేరి వస్తే గానీ సాయంత్రానికి ఇంటికి చేరుకోలేకపోతున్నామని దీంతో తామంతా వ్యయప్రయాసలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తేనే తమ కష్టాలు తీరుతాయని అంటున్నారు.

రాజాం: మండలంలోని ఒమ్మి గ్రామంలో సచివాలయ ఉద్యోగులు సోమవారం ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు కొంతమందికి బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదు జమ చేస్తుండగా, మంచానపడిన రోగులు, వృద్ధులకు ఇంటికి వెళ్లి, పింఛన్ అందిస్తుండడం గమనార్హం. మండలంలో మొత్తం 1858 మందికి ఇంటి దగ్గరకు వెళ్లి పింఛన్లు అందించినట్లు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు.



రామభద్రపురంలోని ఎస్‌బీఐ బీసీ పాయింట్ వద్ద వేచి ఉన్న పింఛన్‌దారులు

రామభద్రపురం: సామాజిక పింఛన్ల కోసం లబ్ధిదారులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. తీవ్రమైన ఎండలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఇతర లబ్ధిదారులు క్యూలైన్‌లో నిలబడి, నానా అవస్థలు పడుతున్నారు. ఇదివరకు వలంటీర్‌ల ద్వారా ఇంటింటికీ పింఛన్ తెచ్చి ఇచ్చిన సందర్భాలను గుర్తుచేసుకుంటున్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వస్తేనే బాగుంటుందని అందరూ భావిస్తున్నారు.

సీహెచ్‌సీకి రోగుల తాకిడి



బాడంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

బాడంగి: మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి రోగుల తాకిడి రోజురోజుకూ ఎక్కువవుతోంది. సోమవారం 150 మంది వరకు వచ్చి, వైద్య తనిఖీలు చేయించుకున్నారు. వీరిలో 40 మంది ఇన్‌పేషెంట్లుగా చేరి, చికిత్స పొందుతున్నారు. రోగుల్లో ఎక్కువ మంది కడుపునొప్పి, విరేచనాలు, జ్వరం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారే ఎక్కువగా ఉన్నారు. ఆస్పత్రిలో చేరుతున్న వారికి సరిపడ బెడ్లు లేకపోవడంతో ఆస్పత్రి వరండాలో కూడా రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో 24 గంటల పాటు వైద్యసేవలు అందుబాటులో ఉండడంతో రోగులు క్రమక్రమంగా కోలుకుంటున్నారని రోగుల బంధువులు చెబుతున్నారు. కొన్ని కేసులను మెరుగైన వైద్యం కోసం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలిస్తున్నారు.

బొండపల్లిలో జూనియర్ కళాశాల ప్రారంభం

బొండపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వం జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసింది. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతులను ఎంఈఓ శోభారాణి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వం జూనియర్ కళాశాలలను అందు బాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. స్థానిక కళాశాలలో ఇంత వరకు ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 18 మంది, సీఈసీ గ్రూపులో ఆరుగురు చేరారని తెలిపారు. మండలంలోని విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను స్థానిక కళాశాలలో చేర్పించాలని కోరారు. ఎంఈఓ–2 అల్లు వెంకటరమణ,హెచ్‌ఎం ఉమామేశ్వరరావు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



టగ్ ఆఫ్ వార్ ఆట ఆడిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతోందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు టగ్ ఆఫ్ వార్, కబడ్డీ, ఖోఖో పోటీలు సోమవారం నిర్వహించారు. ప్రతీ విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు.